



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 311 | ది. 22-2-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 311 | Date : 22-2-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# పేదల ఆదాయం పెంచుతాం...ఆనందాన్ని పంచుతాం

- సంక్షేమం అమలులో ఏపీకి దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ రాదు
- మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ
- ఢిల్లీ ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం
- చెత్త విషయంలో జపాన్ తరహాలో అలవాట్లు మార్చుకోవాలి
- వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**వినుకొండ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని... ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు..** వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవన విధానంలో భాగం కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**పరిసరాల శుభ్రత.. మన బాధ్యత..** 'రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామాలు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్ గార్డెన్లు ఉన్నాయి. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో రూ.1,254 కోట్లతో పీపీపీ విధానంలో 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15కల్లా వినియోగంలోకి తీసుకువస్తాం'అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ..** 'రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాం. ప్లాస్టిక్ వల్ల ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఘన వ్యర్ధాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటం, విద్యుత్ ఉత్పత్తి లాంటివి చేస్తున్నాం. చెత్త సేకరణ కోసం ట్రై సైకిళ్లు, ఈ-ఆటోలు, వివిధ యంత్రాలను వినియోగిస్తున్నాం. విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రి సహా మరో 5 ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేందుకు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్ధాల నిర్వహణలో మన ఆలోచనా తీరు మారాలి. మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి సంక్రమిత వ్యాధులు తడి వ్యర్ధాల కారణంగానే వస్తున్నాయి. జపాన్ లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. అక్కడి పౌరుల తరహాలో మనమూ కొన్ని అలవాట్లను మార్చుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు.

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

# జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు

- హిందువుల మనోభావాలంటే లెక్కేలేదు.
- దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారు.
- దేవుడితో వైసీపీ నీచ రాజకీయం

**ఏలూరు/నూజివీడు,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్నచూపు ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ కలియుగ ఆరాధ్య దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేసారన్నారు. జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్ లో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి దిగజారారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల



కేంద్రాలుగా మార్చారని, ఇప్పుడు ఏకంగా దేవుడి ఫొటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారన్నారు. శ్రీవారి పరకామణి కేసులో నిందితుడైన అధికారి కూడా అర్ధం కాని రీతిలో చనిపోవడం జరిగిందన్నారు. శ్రీవారు నడయాడు ప్రదేశ మైన మాడవీధుల్లో జగన్మోహన్ రెడ్డి చెప్పులతో తిరగటం నిర్లక్ష్యానికి నిలువుటద్దం అన్నారు. టీటీడీ నిధులను దారి మళ్లించి తిరుపతి నగరపాలక సంస్థ పేరిట కోట్ల రూపాయిలు దోచున్నారని తెలిపారు. వెంకన్న కిచ్చే తలనీలాలను సైతం వైసీపీ దోపిడీకి అతీతం కాలేదన్నారు. ఒకటికాదు, రెండు కాదని, వందలాది దాడులు హిందూ దేవాలయాలపై జగన్ పాలనలో పదేపదే ప్రతిరోజు జరుగు తుండేవన్నారు. దోషులను శిక్షించకుండా హిందువులకు మనోధైర్యం ఇవ్వకుండా, ఈ ఘటనలు ఖండిస్తున్నామని కూడా చెప్పకుండా ఐదేళ్లు జగన్ రెడ్డి హిందూ వ్యతిరేక విధానాలు కొనసాగించాడని స్పష్టం చేశారు. వైసీపీ హయంలో అనేక హిందూ దేవాలయాలు పై దాడులు, విగ్రహాలు ధ్వంసం ఘటనలు జరిగినా అప్పటి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఒక్కరోజు కూడా వెళ్లి పరిశీలించ లేదన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించు కుని స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా సమర్పిస్తారు, కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఏ రోజు సతీసమేతంగా పట్టువస్త్రాలు ఇవ్వకుండా హిందూ సంప్రదాయాలను కాలరాశాడని అన్నారు. అన్యమతస్థుడైన జగన్ రెడ్డి.. ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యటించడం, స్వామి వారికి తాను ఒక్కడే పట్టువస్త్రాలు సమర్పించడంపై పండితులు, మేధావులు అభ్యంతరం వ్యక్తం చేసినా జగన్ రెడ్డి ఏ రోజు ఖాతరు లేదని తెలిపారు.


## గ్రామ పంచాయతీ కార్యాలయం, అంబాపురం
## టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.నిల్ /2026 తేది : 21-02-2026

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయతీలో నందు ది.01.04.2026 నుంచి ది.31.03.2027 వరకు కాంట్రాక్టు పద్ధతిపై ఈ దిగువ పనులు ఏజెన్సీ పద్ధతిపై నిర్వహించుటకు గాను ది. 02-03-2026 ఉదయం 11.30 గంటలకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరాలు గ్రామ పంచాయితీ కార్యాలయ పనివేళలయందు తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని వివరము | | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|---|
| 1) | కాంట్రాక్టు లేబరు ప్రజారోగ్య పనులు నిర్వహించుటకు | 23 | | |
| 2) | కాంట్రాక్టు లేబర్ ట్యాంకు వాచర్ పనులు నిర్వహించుటకు | 02 | | |
| 3) | కాంట్రాక్టు లేబర్ ఎలక్ట్రికల్ పనులు నిర్వహించుటకు | 02 | ది. 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.15,000/- |
| 4) | కాంట్రాక్టు లేబరు డ్రైవర్ ట్రాక్టర్ మరియు ఆటో నడుపుట | 03 | | |
| 5) | గ్రామ పంచాయతీకి కావల్సిన ఈక్రింది తెలిపిన వస్తు సామాగ్రి 1. మంచినీటి సరఫరా సామాగ్రి 2. స్టేషనరీ. 3.వీధి దీపములు, విడి భాగములు, 4. ప్రజారోగ్యం | | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.5,000/- |

నోట్ :-
కాంట్రాక్టు లేబరు స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడును. గత అనుభవం, కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. గ్రామ పంచాయతీ నిధులను బట్టి పేమెంట్లు చెల్లించబడును.

సం/-శ్రీ గండికోట సీతయ్య
సర్పంచ్
అంబాపురం, గ్రామ పంచాయితీ

సం/- దేవరపల్లి శ్రీనివాసరావు
కార్యదర్శి
అంబాపురం, గ్రామ పంచాయితీ


## ఏపీలో కాంగ్రెస్ కార్యాలయాలపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి.. తీవ్ర ఉద్రిక్తత



**గుంటూరు, ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ స్థాయి 'ఏఐ సమ్మిట్'పై రాహుల్ గాంధీ ప్రధాని మోదీని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు ఏపీలో ఉద్రిక్తతకు దారితీశాయి. అయితే, రాహుల్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఏపీలోని పలు జిల్లాల్లో బీజేపీ యువమోర్చా శ్రేణులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడులకు దిగాయి. గుంటూరు జిల్లాలో కాంగ్రెస్ కార్యాలయంపై రాళ్లు, కోడి గుడ్లతో దాడి చేశారు బీజేపీ కార్యకర్తలు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీపై దాడి చేశారు. ప్రతిగా బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెసు కార్యకర్తలు నినాదాలు చేశారు. పోలీసుల తీరుపై మస్తాన్ వలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పార్టీ ఆఫీస్‌లపై దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తారా..? మేం తిరిగి దాడులకు తెగబడిన ఒక్క బీజేపీ కార్యకర్త కూడా మిగలడంటూ' ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోడిగుడ్లు, టమోటాలతో కాంగ్రెస్ పార్టీ ఆఫీసుపై బి.జె.వై.ఎం.రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, అనుచరులు దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసు గేటు ధ్వంసం చేసి ఫ్లెక్సీలను చింపేశారు. దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. విజయనగరం జిల్లా లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ కార్యకర్తలు.. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మతోపాటు పార్టీ కార్యాలయం బోర్డు దగ్ధం చేశారు. ఏపీ వ్యాప్తంగా పలు చోట్ల కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చనిపోయిన 18ఏళ్లకు అంత్యక్రియలు- ఆయేషా మీరా కేసు క్లోజ్

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సంచలనం రేపిన కేసు
- 2007లో హాస్టల్ లో ఆయేషాపై అత్యాచారం చేసి చంపేశారని ప్రధాన ఆరోపణ.
- నిందితులను గుర్తించడానికి ఆధారాలు లభించలేదన్న సీబీఐ.



**విజయవాడ, ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తీవ్ర సంచలనం సృష్టించిన బీ-ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో దర్యాప్తు ముగిసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లుగా విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు ప్రకటించింది. సీబీఐ సమర్పించిన తుది నివేదికను కోర్టు ఆమోదించింది. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది న్యాయస్థానం. ఈ నెల 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది కోర్టు. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండోసారి పోస్ట్ మార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి డాక్టర్ల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీస్ అధికారులు మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో డిసెంబర్ 27న రాత్రి ఇబ్రహీంపట్నం హాస్టల్ లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైంది. 18ఏళ్లుగా సాగుతున్న దర్యాప్తులో నిందితులను గుర్తించలేకపోయారు.

**ఎన్నిసార్లు కోర్టు మెట్లు ఎక్కినా.. దక్కని న్యాయం..** రెండు దశాబ్దాలుగా ఆయేషా ఆత్మ రోదిస్తూనే ఉంది. ఆ రోజు హాస్టల్ లో ఆయేషా చేసిన అరుపులు తల్లిదండ్రుల గుండెల్లో ఇప్పటికీ మారుమోగుతూనే ఉన్నాయి. న్యాయం కోసం ఆమె తల్లిదండ్రులు ఎన్నిసార్లు కోర్టు మెట్లు ఎక్కినా, ఎన్ని పోలీస్ స్టేషన్లకు తిరిగినా నిరీక్షణ తప్ప న్యాయం దొరకలేదు. సీబీఐ విచారణ చేపట్టింది. సమాధిని తవ్వారు. రెండోసారి పోస్టుమార్టం చేశారు.

# నేడు చంద్రగిరిలో జల్లికట్టు

### అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రత్యేక ఏర్పాట్లు : సక్కురు ధనుంజయ రెడ్డి



**చంద్రగిరి,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** జిల్లాలో జల్లు కట్టుకు పుట్టినిల్లు చంద్రగిరి. సంక్రాంతి మొదలు ఉగాది వరకు చంద్రగిరి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జల్లికట్టు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. వీటిని చూడడానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తుంటారు . ఈ సాంప్రదాయాన్ని దశాబ్దాల కాలం నుండి ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం చంద్రగిరి పట్టణంలో ఈ జల్లు కట్టు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు జల్లు కట్టు నిర్వాహకులు, టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షులు సక్కురు ధనుంజయ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి మండల పరిధిలో కని విని ఎరుగని రీతిలో చంద్రగిరి పట్టణంలో ఈ జల్లు కట్టును నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుండి ప్రజల అధిక సంఖ్యలో చంద్రగిరి కి రానున్నారని, అంతేకాకుండా జల్లికట్టులో పాల్గొనడానికి పశువులు సైతం చుట్టుపక్కల పల్లెల నుండి 500 కు పైగా చంద్రగిరి కి వస్తాయని ఆయన తెలియజేశారు. పట్టణ ప్రజలకు, జల్లికట్టు వీక్షించేందుకు వచ్చిన ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యవేక్షణలో చంద్రగిరి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీ మూలస్థానం ఎల్లమ్మ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా, క్లస్టర్ ఇంచార్జ్ మండలం లోకేష్, కడియాల రవితేజ యాదవ్, టిడిపి టౌన్ వైస్ ప్రెసిడెంట్ లీలా కృష్ణ పాల్గొన్నారు.

## కల్వకుర్తి నియోజకవర్గంలో వివాహ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరు.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 21):**కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకల్లో కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత సురేందర్ రెడ్డి సహా ఇతర స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి 21):**ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు వివాహ శుభకార్యాలకు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## బేగంపేట్‌లో భారీ చోరీ... రూ.40 లక్షల ఆస్తి రికవరీ.






**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి21):** హైదరాబాద్ లోని బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గృహ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు,నగదు దోచుకెళ్లిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు రెగ్యులర్ నేరస్తులను అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి 235 గ్రాముల బంగారు ఆభరణాలు,రెండు మొబైల్ ఫోన్లు,రూ.65వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసిన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని బేగంపేట ఏసిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులను అలరించిన అన్నమయ్య స్వరార్చన






**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)**అన్నమయ్యపురం లో డా.శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నమ స్వరార్చన కార్యక్రమం భక్తి పారవశ్యంలో కొనసాగింది.పారాయణ అనంతరం నృత్య కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో,గురువు సునంద గంధం మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్న కుమారి నిడమర్తి తులసి అన్నమయ్య సంకీర్తనలకు భావభరిత కూచిపూడి నృత్యార్చన సమర్పించింది.తులసి ప్రదర్శన భక్తులను అలరించింది.అనంతరం అన్నమాచార్య భావనా వాహిని మేనేజింగ్ ట్రస్టీ డా.నందకుమార్ తులసిని,గురువును సత్కరించారు .మంగళహారతి,ప్రసాద వితరణతో ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయండి

### -ఎమ్మెల్యే గాంధీ ఆదేశం

**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)**:గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సాయి వైభవ్ కాలనీలో ఎమ్మెల్యే ఎస్ డి ఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనాతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కాలనీ వాసులకు సమావేశాలు, కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని తెలిపారు.నాణ్యత ప్రమాణాల తో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,పద్మ, సుజిత్,శ్రీనివాస్, సత్యనారాయణ,పవన్,సిద్దార్థ్, నవీన్ తదితరులు



పాల్గొన్నారు.

# సర్వేంద్రియానాం... నయనం ప్రధానం

● విన్ విజన్ కంటి ఆసుపత్రి.... సౌజన్యంతో కంటి వైద్య శిబిరం. ● మదర్ తెరిసా కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్.




**జవహర్ నగర్ ఫిబ్రవరి 21: (వార్తా ప్రభ)** సర్వేంద్రియానం నయనం ప్రధానమని లోకంలో సర్వ ఇంద్రియాలకునయనాలే(కనుపాపలు) ప్రధానమని సర్వ జీవరాసులకు నేత్రాలే ప్రధాన అవయవాలను తెలిపారు. అటువంటి అవయవాల రక్షనే ధ్యేయంగా విన్ విజన్ ఫౌండేషన్, బాలవికాస ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విన్ విజన్ కంటి ఆసుపత్రి యాజమాన్యం ఫిబ్రవరి 22 తేదీన(ఆదివారం) జవహర్ నగర్ పరిధిలోని లెప్రసీ కాలనీలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, ఈ వైద్య శిబిరాన్ని మదర్ తెరిసా కాలనీ ప్రజలే కాకుండా జవహర్ నగర్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉచిత కంటి పరీక్షా శిబిరం ఆదివారం స్థానిక మదర్ తెరిసా కమ్యూనిటీ హాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించబడుతుందని ఈ శిబిరం ప్రముఖ నేత్ర వైద్య సంస్థ విన్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని, ఈ వైద్య శిబిరం ఎన్ అండ్ ఎన్ ఫౌండేషన్, బాలవికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ఇట్టి అవకాశాన్ని జవహర్ నగర్ ప్రజలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# వీధి కుక్కలతోటి, పిచ్చి కుక్కల తోటి ప్రజల అప్రమత్తంగా ఉండాలి.

### కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,**:ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**నేతాజీ నగర్ కాలనీ చుట్టుపక్కల కాలనీలో ఉన్న కుక్కలను మున్సిపల్ సిబ్బందికి పిలిపించుకొని కుక్కలను నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షుడు వబేరి రామచంద్ర యాదవ్ మరియు కాలనీవాసులు పట్టించారు. ఈ మధ్యన పిచ్చి కుక్కలు, వీధి కుక్కల బెడద చాలా ఎక్కువ అయింది. చిన్నపిల్లలకు కరవడం, మొత్తంగా పిక్కు తినడం, వృద్ధులను మరియు చిన్నపిల్లలను మహిళలను కరువడమే కాకుండా మనుషులను భయభ్రాంతులను చేసి కాళ్లను పట్టుకుని మాంసం వచ్చే వరకు కూడా పట్టి పీక్కు తినడం కరవడం బాధాకరమని "భేరి"ఆందోళన వ్యక్తం చేశారు. శేరీ లింగం పల్లి లోని ప్రజలందరికీ, ముఖ్యంగా చిన్న పిల్లలకు,వారి తల్లి దండ్రులకు"భేరి" విజ్ఞప్తి చేస్తూ కుక్కల బారి నుండి జాగ్రత్తగా ఉండాలని, తమ ప్రాణాలను రక్షించుకోవాలన్నారు.

# కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి డిజైన్ రూపొందించాలి

### - విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఆదేశం

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించి వెంటనే డిజైన్ రూపొందించాలని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అమృత్ భారత్ 2.వా లో రూ.10 కోట్లతో కొండపల్లి రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే కొండపల్లి రైల్వే స్టేషన్ ను శనివారం ఆయన పరిశీలించారు. జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల గాంధీ ఆధ్వర్యంలో డీఆర్ఎంను కలిసి ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలను చర్చించారు. ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ ను టికెట్ బుకింగ్ పక్కన నిర్మించాలని, వృద్ధులు, మహిళల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్యాసింజర్ రైలును ఇక్కడ ఆపాలని, శాతవాహన, ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ లకు హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీఆర్ఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్, కో - ఆప్షన్



సభ్యుడు యర్రంశెట్టి నాని, టీడీపీ నాయకులు మేడా శ్రీను, ప్రభాకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ లను సందర్శించిన డి.ఈ.ఓ. నారాయణ



**పోడూరు: ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూరు శాతం ఉత్తీర్ణతను సాధించుటకు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధపరచాలని పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. పోడూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ లను పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఇ. నారాయణ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కొద్ది రోజులలో నిర్వహించబడే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థుల పట్ల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనపరిచి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధపరిచి జిల్లాని అగ్ర స్థానంలో నిలపాలని అన్నారు. ప్రాథమిక తరగతులలో అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులపై ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యం. ఇ. ఓ -2 జి వి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## త్వరలో అందుబాటులోకి 30 పడకల ఆసుపత్రిగా చినపాండ్రకా పి హెచ్ సీ...

### ఎం.ఎల్.ఎ కాగిత వెల్లడి



**కృత్తివెన్ను ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృత్తివెన్ను మండలం చిన పాండ్రక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజల సౌకర్యార్థం వైద్యం అందుబాటులో అందించేందుకు శనివారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమం లో భాగంగా త్వరలో 30 పడకల ఆసుపత్రి గా సిద్ధం చేస్తున్నట్లు శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు ఆయన స్వయంగా పాల్గొని ఆసుపత్రి ప్రాంగణాన్ని నాయకులు కార్యకర్తలతో కలిసి శుభ్రం చేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

# వార్తా ప్రభ హైదరాబాద్

## ధూళిపాల కుటుంబ వివాహ వేడుకలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి,ఫిబ్రవరి 21(వార్తాప్రభ):**గాజులరామారంలోని సత్య గౌరీ కన్వెన్షన్ లో నిర్వహించిన ధూళిపాల కుటుంబ వివాహ వేడుకలకు పూర్ణచంద్రరావు గుప్తా ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారి కుమార్తె అలేఖ్య,అల్లుడు సన్నిత్‌ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను అభినందించారు. నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రిలీజైన రూ.2.10 లక్షల ఎల్.ఓ.సీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 21):**ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినపురం డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీకి చెందిన అండాలు రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతుండగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ను సంప్రదించారు.వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ.2,10,000 ఎల్.ఓ.సీ మంజూరైంది. బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తూ, పేదల ఆరోగ్య పరిరక్షణలో సీ.ఎం. సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విశేషంగా ఆకర్షించిన ఖాదీ మహోత్సవం - 2026



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామంలో నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవం--2026లో ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఖాదీ,చేనేత,హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది.వావిలాల ఖాదీ ఉత్పత్తులు,తోలు వస్తువులు, బ్యాగులు,కలంకారీ చీరలు,డ్రెస్ మెటీరియల్స్‌తో పాటు బీహార్ ఖాదీ ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి.సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రియా దేశాయి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో రంజింపజేసింది. "మూషిక వాహన", "పుష్పాంజలి", "నారాయణ స్తోత్రం", "రాసలీలలు", "భో శంభో" తదితర అంశాలను విద్యార్థులు సమన్వయంతో ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

## సైబర్ నేరాలపై మల్కాజిగిరి పోలీసుల కఠిన చర్యలు: సైబర్ క్రైమ్ డిసిపి.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 21):**మల్కాజిగిరి కమిషనరేట్,సైబర్ క్రైమ్ డిసిపి నాగలక్ష్మి వెల్లడించిన వివరాల ప్రకారం,గత వారం రోజుల్లో 4సైబర్ మోసం కేసులను పోలీసులు ఛేదించి 7మందిని అరెస్టు చేశారు.మ్యాట్రిమోనీ,ఇన్వెస్ట్‌మెంట్,పార్ట్‌టైం జాబ్ పేర్లతో జరిగిన మోసాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయన్నారు. మోసపోయిన బాధితులకు కోర్టు ఆదేశాల మేరకు రూ.31,72,966/- రిఫండ్ చేయించినట్లు తెలిపారు.ప్రజలు అపరిచిత కాల్స్,అధిక లాభాల హామీలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

# ఎడిటోరియల్

## ఉండవల్లి కోసం జగన్ ఉడుం పట్టు ?

ఉండవల్లి అరుణ్ కుమార్. మాజీ ఎంపీ. రెండు సార్లు వరసగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వారు రాజకీయ మేధావిగా గుర్తింపు తెచ్చుకున్నారు. న్యాయవద విద్యను అభ్యషించిన వారు కాబట్టి వాదనా పటిమ బాగానే ఉంటుంది. తాను అనుకున్నది సూటిగా స్పష్టంగా చెప్పగలవారు. ప్రత్యర్థులను చీల్చి చెండాడడంలో దిట్ట. వైఎస్సార్ కి అత్యంత సన్నిహితులలో ఒకరుగా ఉన్నారు. అలాంటి ఉండవల్లి రాజకీయాల నుంచి తప్పుకుని అపుడే పుష్కర కాలం గడచిపోయింది. ఉమ్మడి ఏపీ ఆయన కోరిక. ఆయన పట్టుదల కూడా. కానీ అడ్డగోలుగా విభజించడాన్ని ఆయన తట్టుకోలేకపోయారు. అది కూడా సవ్యంగా విభజన జరగలేదని ఆయన ఈ రోజుకీ న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ని ఆయన ఈ కారణంగానే వదిలి బయటకు వచ్చారు. అంతే కాదు రాజకీయాలకే అతి పెద్ద దండం పెట్టేశారు.అయితే రాజకీయాలు అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పే ఉండవల్లి రాజకీయ విశ్లేషకుడిగా కనిపిస్తూ ఉంటారు. మీడియా ముందుకు వచ్చి ఆయన అనేక విషయాలను ప్రస్తావిస్తూ ఉంటారు. అధికారంలో ఉన్న వారిని ప్రతిపక్షంలో ఉన్న వారిని సైతం ఆయన విమర్శిస్తూంటారు. తన వయసు రిత్యా ప్రత్యక్ష రాజకీయాలు చేయలేను అని ఉండవల్లి చెబుతూ వస్తున్నారు. ఆయన కనుక చేరాలనుకుంటే పార్టీలు తీసుకునేందుకు రెడీగా ఉంటాయి అని అంటారు. ఇదిలా ఉంటే ఉండవల్లిని తమ పార్టీలో చేర్చుకోవాలని వైసీపీ చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా జగన్ అయితే ఈ విషయంలో చాలా ఆసక్తిగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. తన తండ్రి సమకాలీనుడు సబ్జెక్ట్ మీద మంచి పట్టు ఉన్న వారు అయిన ఉండవల్లి పార్టీలో చేరితే వైసీపీ వాయిస్ మరింత బలంగా జనంలోకి వెళ్తుందని ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. తాజాగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న అంబటి రాంబాబును ఉండవల్లి పరామర్శించి వచ్చారు. ఆ మీదట తిరుమల లడ్డూ విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అతి పోకడలను ఆయన తప్పు పట్టారు. దీంతో వైసీపీలో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయని అంటున్నారు రాయబారాలతో : ఇక కాంగ్రెస్ లో సీనియర్ నేతలను చేర్చుకోవాలని వైసీపీలో కీలక మార్పులు తీసుకుని రావాలని జగన్ భావిస్తున్నారు అని అంటున్నారు. ఈ క్రమంలో ఉండవల్లి వైసీపీలోకి వచ్చేలా చూడాలని ఆయన కొందరు నేతలకు బాధ్యతలు అప్పగించారని ప్రచారం సాగుతోంది. ఉండవల్లికి అతి సన్నిహితులు గా ఉన్న వారితోనే రాయబారాలు నడుపుతున్నట్లుగా చెబుతున్నారు. ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న వైసీపీకి సలహాదారుగా ఉంటూ రాజకీయంగా పార్టీకి సూచనలు ఇచ్చే విధంగా ఉన్నా చాలు అన్నది వైసీపీ పెద్దల మాటగా ఉందిట. అయితే ఉండవల్లి ఇప్పటికే కుండబద్ధలు కొట్టేశారు. తాను రాజకీయాలకు బహు దూరం అని అన్నారు. తనకు ఏ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదని కూడా తేల్చేశారు. అయితే వైసీపీ మాత్రం ఆయనను తమతో ఉండాలని కోరుతోంది. 2024 ఎన్నికల తరువాత వైసీపీ ఓటమి భారీగా అందుకుంది. వర్తమానంలో కూడా అనేక విషయాలలో సరైన విధంగా పోరాటం చేయలేకపోతోంది. డిఫెన్స్ మోడ్ లోనే ఈ రోజుకీ ఉంది. దీంతో వైసీపీకి మంచి వక్తలు వాదనాపటిమ ఉన్న వారి కొరత ఉంది అని అంటున్నారు. ఉండవల్లి లాంటి వారు అయితే తమకు ఎంతో కలసి వస్తుందని కూడా భావిస్తోంది. ప్రజలలో కూడా ఇమేజ్ పెరుగుతుందని లెక్కలేస్తోంది. వైఎస్సార్ సన్నిహితులను చేర్చుకునే పనిలో : మొత్తానికి ఉండవల్లిని ఒప్పించి అయినా తమతో వచ్చేలా చూడాలని వైసీపీ అయితే గట్టి పట్టుదలగా ఉంది. కానీ ఉండవల్లి దీని మీద ఏమంటారో చూడాల్సి ఉంది. మరో వైపు చూస్తే మరింతమంది కాంగ్రెస్ సీనియర్ నేతలను వైఎస్సార్ సన్నిహితులను వైసీపీ చేర్చుకునే పనిలో ఉందని అంటున్నారు. అందులో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన సీనియర్ నేత ఒకరు అయితే ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేత ఉభయ గోదావరి జిల్లాలో బిగ్ షాట్ అయిన మరో నేత ఉన్నారని అంటున్నారు. చూడాలి మరి వైసీపీ ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు



విస్సన్నపేట ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి) స్థానిక మండలంలోని కలగర లక్ష్మీపురం గ్రామంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని ( చిన్ని) శివనాద్ చొరవతో 1,25,200 చెక్కులను మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు గరిమెళ్ళ భాస్కరరావు ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి చిన్ని చెన్నారావు నరేష్ సత్యం రమేష్ చలపతిరావు పాల్గొన్నారు.

## ముఖ్యమైనవి జీవితాన



ప్రశాంతమైన జీవనము
స్వర్గంతో సమానము
కోపాగ్ని జ్వాలల్లో
కాలిపోకు ఓ నేస్తము
స్వార్థమనే ఊబిలో
ద్వేషమనే లోయలో
ఎక్కువ కాలముండకు
పగ పాము పడగ నీడలో
అహంకారం ఉచ్చులో
వెటకారం నిప్పుల్లో
కలకాలం ఉండబోకు
దుర్మార్గుల దారిలో
ఉన్నతంగా చదవాలి
జీవితంలో ఎదగాలి
నలుగురికి ఆదర్శము
పంచాలి ఆనందము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు, ఎమ్మిగనూరు,సెల్:9966414580

# అన్న ప్రసాదంను దుర్గ గుడి ఈ ఓ స్వీయ సేకరణ





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ దుర్గమ్మ అన్నప్రసాదంను ఆలయ ఈవో శ్రీ సీనా నాయక్ స్వయంగా స్వీకరించారు. ఏ ఈ ఓ సుధారాణి పర్యవేక్షణలో భక్తుల మనోభావాలు తెలుసుకొన్నారు.అద్భుతమైన రుచి: "అమ్మవారి ప్రసాదం అమృతంలా ఉంటుంది" అని భక్తులు తరచుగా చెబుతుంటారు. ముఖ్యంగా ఇక్కడ వడ్డించే పప్పు, సాంబార్ మరియు పులిహోర రుచి మరువలేనిదని అనేకమంది భక్తుల అభిప్రాయం.శుచి మరియు శుభ్రత పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాన హాల్ (మహా మండపం 3వ అంతస్తు) ఎంతో విశాలంగా, పరిశుభ్రంగా ఉంటుందని భక్తులు ప్రశంసిస్తున్నారు. వడ్డించే విధానం కూడా ఎంతో క్రమశిక్షణతో కూడి ఉంటుంది.నిరంతర సేవలనూ కొనియాడారు. ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నిరంతరాయంగా భక్తులకు భోజన సౌకర్యం కల్పించడం పట్ల యాత్రికులు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సేవా భావం ఎటువంటి వివక్ష లేకుండా వేలాది మందికి ప్రతిరోజూ ఉచితంగా భోజనం అందించడం ఒక గొప్ప సామాజిక సేవగా భక్తులు కొనియాడుతున్నారు.

# మన నగరం మనందరి బాధ్యత, రాయన భాగ్యలక్ష్మి మేయర్

### వ్యర్థాలను చెత్తబుట్ట లోనే వేయాలి, ధ్యానచంద్ర కమిషనర్








**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మన నగరం, మనందరి బాధ్యతని, విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఉదయం పున్నమి ఘాట్ భవానిపురంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్య లక్ష్మి మాట్లాడుతూ మన నగరం, మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించి నగరంలో వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పోయకుండా కేవలం చెత్తబుట్టలోనే వేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నగరంలో పారిశుద్ధ్య కార్మికులకు తోడుగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వ్యర్థాలను కేవలం చెత్తబుట్టలోనే వేయాలని ఇంటి వద్దనే వ్యర్థాలను విభజించి నగరపాలక సంస్థ వారికి అప్పజెప్పాలని ఎరుపు, నీలం, పచ్చ బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని, హానికరమైన వ్యర్థాలు వేరే చెత్తబుటలో వేస్తే పారిశుద్ధ్య కార్మికులు వాటిని తీసేటప్పుడు వారికి ప్రమాదం కలిగే అవకాశం ఉంటుందని కావున దాని గమనించి ప్రజలందరూ వ్యర్థాలను వేరుచేసి పరిశుద్ధ కార్మికులకు ఇవ్వాలని అన్నారు. తదుపరి దోమలు పెరగకుండా ఎలా నిర్మూలించాలని వంటి అంశాలపై అక్కడికొచ్చే ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్, ఇంట్లోనే ఎరువులు తయారు చేసే స్టాల్, వ్యర్థాలను రీసైకిల్ ఎలా చేయాలి అని అవగాహన కల్పించే స్టాల్స్ ను సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీరో వేస్ట్ లిటర్ గురించి, చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయొద్దు చెత్తబుట్టనే వాడండి అనే నినాదాలతో రాలిని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) విజయలక్ష్మి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్ బేగ్ ను కలిసిన నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి )**ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నియమింపబడిన ఎం.ఎస్.బేగు ని నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు శనివారం ఉదయం విజయవాడ భావానిపురం లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ గా నియమింపబడిన తర్వాత అధికారికంగా ఠాగూర్ గ్రంథాలయంలో జరిగే ఒక పుస్తకావిష్కరణ సభకు తొలిసారిగా హాజరవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని బేగ్ ను నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, పుస్తకాలను జ్ఞాపికలుగా అందించారు. ఈ సందర్భంగా రచయితలకు గ్రంథాలయాలకు వున్న అనుబంధాన్ని ఆయనకు వివరించారు. అనంతరం బేగ్ మాట్లాడుతూ– గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. గౌరవ మంత్రివర్యులు నారా లోకేష్ నాయకత్వంలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఎన్నో వసతులతో ఉన్నతంగా వేగంగా నిర్మాణం జరగబోతుందన్నారు. ఈ లైబ్రరీలో పుస్తకాలను డిజిటలైజ్ చేసే గొప్ప సౌకర్యం వుండబోతుందన్నారు. రచయితలకూ గ్రంథాలయాలకు మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేకుండా సామరస్యభావంతో అభివృద్ధి దిశగా అడుగులేద్దామని అన్నారు. అందుకు రచయితల సంఘాలు జర్నలిస్టు సంఘాలు తోడ్పాటునందించాలన్నారు. ఎం.ఎస్.బేగ్ ను కలిసిన వారిలో నవ్యాంధ్ర రచయితల సంఘం జనరల్ సెక్రెటరీ కలిమిశ్రీ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ యేమినేని వెంకట రమణ, కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్, జిల్లా నాయకులు విష్ణుభొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముదినేపల్లిలో సమగ్ర అభివృద్ధి లక్ష్యం ఎంపీపీ రామిశెట్టి





**ముదినేపల్లి ఫిబ్రవరి 21 (వార్తా ప్రభ)**ముదినేపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) రామిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మధ్యాహ్నం ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సమావేశం ప్రారంభానికి ముందు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంవీ సుబ్బారావు , ఎన్ఆర్‌సీజీఎస్ టీఏ లక్ష్మీనారాయణ గారు ఇటీవల మరణించగా సభ తరఫున వారికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

**గ్రామ సమస్యలపై అధికారులు దృష్టి సారించ్చాలి**

ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సమన్వయంతో పని చేసి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల చేయాలి.ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం నిర్ణయించిన నెలకు రూ. 3,000 గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో డిమాండ్ చేశారు.

**వేసవి త్రాగునీటి పై ముందస్తు చర్యలు** రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. గ్రామ పంచాయతీ నీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ (కాల్షియం హైపోక్లోరైట్) వినియోగం ద్వారా నీటిలోని హానికర బ్యాక్టీరియా, వైరస్‌లను నివారించి నీటిని శుద్ధి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా బ్లీచింగ్ కార్యక్రమాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు.

**సర్పంచులకు ఘన వీడ్కోలు** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఇదే ఆఖరిదని ఈ సందర్భంగా అన్ని గ్రామాల సర్పంచులకు ఘన సన్మానం నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశరమ్మ, ఎంపీటీసీలు కలిసి సర్పంచులకు సత్కారం చేసి వీడ్కోలు పలికారు. ఇప్పటివరకు మండల పరిషత్ నిధులు కేటాయించి సహకరించినందుకు సర్పంచులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం లక్ష్యంఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ముదినేపల్లి మండలం మొదటి స్థానంలో నిలిచేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశరమ్మ, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాబక్షు, ఎంపీడీవో వై. రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పులగం లక్ష్మణ కీ సర్జరీ నిమిత్తం 50 వేలు ఎల్.ఓ.సి. మంజూరు చేయించిన ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 21( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని తోట చర్ల గ్రామంలో పులగం లక్ష్మణ కి కాలు సర్జరీ నిమిత్తం 50 వేలు ఎల్.ఓ.సి ని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కృషితో మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పులగం లక్ష్మణ, ఇతని సోదరుడు పులగం కృష్ణ మాట్లాడుతూ మాబోటి దళిత నిరుపేద కుటుంబాన్నీ గుర్తు పెట్టు కొనీ ఈ సహాయం చేసినందుకు ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య కు కృతజ్ఞతలు తెలిపారు.

## కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం



**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 21:(వార్తా ప్రభ ప్రతినిధి)**పాఠశాల స్థాయి నుంచే కరాటే నేర్చుకోవటం ద్వారా బాలబాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. కళాశాలలో నిర్వహించిన కరాటే పరీక్షల్లో వివిధ రకాల బెల్ట్ లు సాధించిన విద్యార్థులకు పతకాల ప్రదానోత్సవం శనివారం కళాశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ కరాటే సాధన చేయటం ద్వారా శారీరద దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా కలుగుతుందన్నారు. అనుకోని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండే లక్షణం పెరుగుతుందన్నారు. కరాటే శిక్షకురాలు జి.వరలక్ష్మీదేవి మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్న కెబిఎన్ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 11 మందికి ఎల్లో బెల్ట్స్, 6 గురికి గ్రీన్ బెల్ట్స్, 6 గురికి పర్పుల్ బెల్ట్స్, 6 గురికి ఆరంజ్ బెల్ట్స్, 4 గురికి బ్రౌన్ బెల్ట్స్ ప్రదానం చేసారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు విద్యార్థులను అభినందించారు.

## అమరావతిలో బి ఆర్ అంబేద్కర్ కి ప్రత్యేక స్తానం పట్ల హర్షం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అమరావతి లోఏర్పాటయ్యే స్టేట్ సెంట్రల్ లైబ్రరీని ప్రపంచ మేధావి నవ భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బి ఆర్ అంబేద్కర్ జ్ఞాన కేంద్రంగా నామకరణం చేయాలని అప్పుడే ఆ మహనీయునికి నిజమైన నివాళు లు అర్పించిన వారి మౌతావని భవిష్యత్తులో విద్యార్థులకు ఈ జ్ఞాన లైబ్రరీ మేధావులుగా తయారు అవుతారని ప్రజల ఆశయాలు ఆకాంక్షలను ప్రతిభభించేలా లైబ్రరీ ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు స్పష్టం చేశారని ఆడిటోరియం అన్ని వసతులతో 15 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండేలా నారా లోకేష్ బాబు అధికారులకుసూచించటం హర్షించదగ్గ విషయమని దళితరత్న పరిశపోగు రాజేష్ అన్నారు. రానున్న కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మేధావి వర్గాల వారు మన ప్రభుత్వానికి అండగా ఉంటారని కుల వివక్ష వ్యతిరేక ప్రచార చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దళిత రత్న పరిశపోగు రాజేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

## ఘనంగా దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి



**అనుమసముద్రంపేట ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేట బస్టాండ్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మంత్రి మేకపాటి గౌతం రెడ్డి నాలుగవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశములమేరకు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి మండల జడ్పిటిసి సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ సూచనల మేరకు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమి వెంకట రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కీర్తిశేషులు స్వర్గీయ మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తొలుత రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి కీర్తిశేషులు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన తరువాత మేకపాటి గౌతంరెడ్డి చిత్ర పటమునకు ఇటీవల మరణించిన మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటూరి జనార్దన్ రెడ్డి చిత్ర పటమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందానిభాష వైఎస్ఆర్సిపి మండల నాయకులు కోటిరెడ్డి సూరా శ్రీనివాసులు రెడ్డి అయితా వెంకటేశ్వర్లు గూడ భాస్కర్ రెడ్డి పఠాన్ ఖాదర్ రంగారెడ్డి ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

## దివంగత వాసిరెడ్డి శంకర భవాని కి నివాళ్లులు అర్పించిన బ్రేక్ ఇన్స్పెక్టర్ స్వామి.



**.పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 21( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు, శ్రీ తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ వాసిరెడ్డి బేనార్జీ సతీమణి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న బ్రేక్ ఇన్స్పెక్టర్ స్వామి శనివారం వాసిరెడ్డి శంకర భవాని చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు.ఇలాంటి పరిస్థితి లో మీరు దైర్యంగా వుండాలని బేనార్జీ కీ సూచించారు.

# అమరులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్

## శ్రీ కృష్ణ అకాడమీ డైరెక్టర్



వర్సటైల్ సర్వీస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, శ్రీ పాశం రవీంద్ర యాదవ్ - వెంకటరత్న శోభ దంపతులకు జన్మించిన శ్రీ పాశం సర్దార్ అభినంద్ యాదవ్ కు అశ్రునయనాలతో......ఒక మనిషి గా వెళ్ళిపోవచ్చు కాని మీ మహత్తరమైన ఆశయ సోపానం ఎప్పటికీ వీడిపోదు.ఆ నిర్దిష్టమైన ఆశయానికి, సుస్పష్టమైన సమాజ సంఘ సేవకు ప్రతిరూపం మీరు.ఓ పౌరుడిగా, కుమారునిగా, సోదరునిగా, కుటుంబ వంశోద్ధారకునిగా మీరూ చూపిన భద్రతా, బాధ్యత, మీ ఆనంద మాటల వల్లికలు, ఛలోక్తులు, మీ కోపం అన్ని కుటుంబ సభ్యులతో గడిపిన మధుర జ్ఞాపకాల భాశీడాగారం వాటిని స్మరించుకుశీటూ...."కృషితో నాస్తి దుర్భిక్షం" చక్కటి నినాదంతో, విద్య లేనివాడు వింత పశువు తో సమానం, గురువు లేని విద్య గుడ్డి విద్య అని కేవలం పుస్తక జ్ఞానం కాకుండా జీవిత విజ్ఞాన్ని అందించాలనే తలంపుతో శ్రీ కృష్ణ అకాడమీ అనే బోధనా శిక్షణ సంస్థ ద్వారా 20 సంవత్సరాలు గా ఉపాధ్యాయునిగా ఉంటూ సుమారు 1000 మంది పైగా విద్యార్థులను తన భోదనాత్మకమైన, ప్రేరణాత్మకమైన వచనాలతో వారికి విద్యాజ్ఞానాన్ని అందించి సమాజంలో భాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చి గురువుగా, మెంటర్ గా ఎంతో మంది తల్లిదండ్రులకు వారి పిల్లలపై నమ్మకాన్ని నింపిన జ్ఞాన ప్రదాతగా పేద పిల్లల చదువుకి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించిన నిత్య కృషీ వలుడిగా వారికి ఆర్థిక సహాయం అందించి విద్యావెలుగులు నింపిన విద్యాప్రదాతగా తన బోధనా అకాడమీ ద్వారా పేద వారికి ఉచిత విద్యాబోధన చేస్తూ ఎన్నో కుటుంబాల విద్యార్థుల భవిష్యత్తును మలిచిన మార్గదర్శి, మా సర్దార్ అభినంద్ యాదవ్."సమాజమే దేవాలయం" అన్న తలంపుతో వర్సటైల్ సర్వీస్ ట్రస్ట్ సంస్థ ను స్థాపించి ఆ ట్రస్ట్ ద్వారా స్వచ్ కాలనీ పేరుతో కాలనీల పరిసర ప్రాంతాల్లో శుభ్రత, వ్యర్థ సేకరణ. సుదూర పరిసర ప్రాంతాల పరిశుభ్ర సంరక్షణకై కార్యక్రమాలు చేస్తూ ఆ ప్రాంతంలో జీవిస్తున్న నిరుపేదలకు నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు అందించి వారికి అండగా నిలిచి వారి బాధను తన బాధ్యాత గా భావించి చేయూతనిచ్చిన దాతృత్వ సహృదయం మీది."మాధవ సేవే మానవ సేవ" అనే పరమావధిగా భావించిఅనాథ ఆశ్రమాల్లో చిన్నారుల కళ్లలో ఆనంద భాష్యపు చిరు నవ్వులు చూడటానికి వారికి మీరిచ్చిన భరోసా స్ఫూర్తిదాయకం, వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు మనవుడిగా, కొడుకుగా, సేవకునిగా, వంశో ద్ధారకునిగా మీరు వారికి అందించిన సేవ నిజంగా మాధవ సేవే !"వైద్యో నారాయణో హరి" అనే స్మరణతో ఆర్థికంగా వెనుకబడిన వారికి, పేదవారికి తన ట్రస్ట్ ద్వారా వైద్యులను సంప్రదించి వారి తోట్పాటుతో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పక్షపాతం లేకుండా వారందరికి తనవంతుగా వైద్య సహకారాలు అందించిన మీరు నిజశీగా "నర నారాయణ రూపమే"... !"సర్వేశీద్రియానాం నయనం ప్రధానం" అనే తలంపుతో పేదవారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి నా అనుకున్న వారికి ఎలాంటి బేధాభిప్రాయలు చూపకుండా అందరికి కంటి పరీక్ష శిబిరాల ద్వారా పరీక్షలు చేసి తన వంతు కృషితో కంటి చూపుకు సహాయం అందించిన మీరు నిజంగా మా సర్దార్ చిరంజీవే !"ఆరోగ్యమే మహా భాగ్యం" అన్న భావంతో శారీరక, మానసిక మరియు సమాజ శ్రేయస్సే వ్యక్తి యొక్క సంపూర్ణ స్థితి ) అనే పరమార్థశీతో సమాజ ఆరోగ్యం కోసం ప్రతి రోజు నడక, యోగా కార్యక్రమాలతో, దైవ చింతన కార్యక్రమాలతో మాలో నిరంతర స్ఫూర్తిని నింపుతూ ప్రేరణగా నిలిపిన మీ తీరు 'అభినంద'నీయం. ఇది మీ పేరు కూర్పుతో వచ్చిన భావం, మా అభినంద్ యాదవ్."మూగజీవాలను ప్రేమించనివాడు మన:విహీనుడు" అన్న భావ తాత్పర్యంతో ముగజీవాలపై ఉన్న ప్రేమతో పశు గోశాలల్లో తన వంతుగా వాటికి పశు గ్రాసశీ అందించి, గోశాలల సంరక్షణకు మీ వంతుగా సహాయం అందించిన ఆ సహృదయ సేవకు మూగ జీవాల పై ఉన్న కరుణకు మీరు నిజంగా మనసున్న మారాజే..!వీటన్నింటికీ మించి మీకున్న శారీరక వైకల్యాన్నీ జయించి, శరీరానికే వైకల్యం కానీ మనస్సుకు, మన:సంకల్ప బలానికి కాదు అని అకుంఠిత దీక్ష దక్ష లతో తన జీవిత గమనాన్ని సమాజ సేవకు, ఉపాద్యాయ సేవకు అంకితశీ చేసి, నిత్యం విద్యార్థులను తన చుట్టూ ఓ అంతరిక్ష వలయ వారధిగా ఏర్పాటు చేసుకున్న ఆ ఆదిత్యుని గా మీ రూపం మా సొశీతం.ఎవరికి తలవంచని మీ ధైర్యం,జీవితంతో పోరాడిన మీ పోరాటస్ఫూర్తి, సమాజం కోసం గడిపిన ప్రతి క్షణం మాకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తాయి.మీరు బౌతికంగానే లేరు, కానీ మీ నవ్వుల వెలుగు, మీ ఆశయాల సోపానం మా హృదయాల్లో సజీవంగా ఉంటాయి .మీ మాట లేదు, కానీ మీ చిరుమందహాస హావా భావాలు, బోధనాత్మక, ప్రేరణాత్మక ప్రసంగాల స్ఫూర్తి మా ప్రయాణం.తాత సర్దార్ పాశం వెంకటేశ్వరరావు యాదవ్, తండ్రి పాశం రవీంద్ర యాదవ్ నుంచి వచ్చిన సేవా భావ సంకల్పాలను పునికిపుచ్చుకొని వారి ఆశయాలతో ఉన్న మీ రూపం ఎప్పటికి చిరస్మరణీయం

**మీ స్మృతి శాశ్వతం, మీ కీర్తి అజరామం.....**

**జోహార్ జోహార్ జోహార్ జోహార్ జోహార్......**

**పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్.**

## ఏ.పి.ఏం.పి.ఏ.లో చేరిన సీనియర్ జర్నలిస్ట్ మన్నే సాంబశివరావు

***సాదర స్వాగతం పలికిన రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరాం యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు***




**విజయవాడ,** ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**మైలవరం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మన్నే సాంబశివరావు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆ్యాపీయా)లో శనివారం ఉదయం యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ్ యాదవ్ కార్యాలయంలో (విజయవాడ) ఆయనను మర్యాద పూర్వకంగా కలసి యూనియన్ లో చేరారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య లు సాంబశివరావు ని సన్మానించి సాదరంగా ఆహ్వానించారు...జర్నలిస్టుల పట్ల అలుపెరుగని పోరాటం చేస్తున్న నిరంతర శ్రామికుడిలా, నిస్వార్ధ సేవలు అందజేస్తున్న శ్రీరాం యాదవ్ గారి నాయకత్వ లక్షణాలు నచ్చి యూనియన్ లో చేరడం జరిగిందని సాంబశివరావు పేర్కొన్నారు... నిబద్ధతతో యూనియన్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. శ్రీరాం యాదవ్ గారితో కలిసి పనిచేసే అవకాశం కలిగినందకు చాలా సంతోషదాయకమన్నారు.

## అప్పనవీడులో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు.



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 21(వార్తాప్రభ)** అప్పనవిడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి 2000 సంవత్సరం నుంచి అంతరించిపోనున్న భాషల జాబితాలో తెలుగు కూడా ఉందని ప్రతి ఒక్కరూ మన మాతృభాషను కాపాడుకోవాలని భాష ద్వారానే సంస్కృతి వారసత్వం నిలబడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయని తోట పుష్పవతి అన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎం జయలక్ష్మి మరియు బి జ్యోతిలు ఆధ్వర్యంలో ప్రాచీన ఆధునిక వంద మంది కవుల చిత్రపటాలను ప్రదర్శనగా ఏర్పాటు చేసి విద్యార్థులకు తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరించారు. తెలుగు భాష తీయనైనది కమ్మనైనదని మన మాతృభాషను మనం కాపాడుకోలేకపోతే భావితరాలు ఇబ్బందులు గురవుతారని పాఠశాల దశ నుంచి భాష పట్ల మక్కువ పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## రైతు సమస్య పరిష్కారం: తహసీల్దార్ కు కృతజ్ఞతలు



**రొళ్ల ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రొళ్ల మండలం దొడ్డేరి గ్రామ పొలం సర్వే నంబర్ 182 కు సంబంధించిన సమస్యను ఒక రైతు ప్రజా పిర్యాదుల పరిస్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి, శనివారం తహసీల్దార్ చంద్ర శేఖర్ గ్రామానికి వెళ్లి విచారణ జరిపి, సమస్యను పరిష్కరించారు. ఈ పరిష్కారంతో రైతు తహసీల్దార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆరోగ్యం గురించి ఆలోచించే వాళ్లంతా..

## పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టాలి

- **అక్టోబర్ 2 నాటికి బందరును చెత్త సమస్య నుండి విముక్తి చేస్తాం**
- **స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.**



**మచిలీపట్నం** ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రాన్ని స్వచ్ఛతకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని కలెక్టరేట్ సమీపంలో బాలభవన్ ప్రాంగణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ పేరుతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, "స్వచ్ఛతే సేవ -- అభివృద్ధికి పునాది" అని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి పౌరుడు తన బాధ్యతగా స్వచ్ఛతను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామం నుండి నగరం వరకు ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలి. చెత్త నిర్వహణ పద్ధతులు క్రమబద్ధంగా అమలు చేయాలి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రతకు నెలవుగా మార్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలు అధికారులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనడం హర్షణీయం. పరిశుభ్రమైన వాతావరణంతో మాత్రమే ఆరోగ్యం సాకారమవుతుంది. 2024 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇక్కడి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పటి వరకు సుమారు లక్ష టన్నుల చెత్తను గుంటూరులోని వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ కు తరలించాం. మరో రెండు నెలల్లో పూర్తిగా చెత్త తొలగించి చూపిస్తాం. అవసరమైతే మచిలీపట్నంలోనే వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేలా 13 ఎకరాలు కేటాయించాం. అవసరమైన నిధులూ సమీకరించాం. చెత్త మొత్తాన్ని తొలగించి, కార్పొరేషన్‌కు నిధులు తీసుకొచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఏపీ సీఆర్డీఏలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలను కూడా సీఆర్డీఏలో కలపడం ద్వారా మచిలీపట్నం పోర్టును అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి తీసుకొచ్చే అవకాశం లభిస్తుంది. అందుకు అవసరమైన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే పెట్టామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు , జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ , జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

***రెవెన్యూ ,పోలీస్ ,మెడికల్, విద్యుత్ అన్నీ శాఖల సహకారం***

***చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరిండెంట్ తాతా శ్రీధర్***



**చేజర్ల ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)** చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు సోమవారం 23.2. 26 నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభమగుచు న్నవని ఆ కళాశాల చీఫ్ సూపరిండెంట్ తాతా శ్రీధర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటుగా విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మొత్తం కలిపి గరిష్టంగా 87 మంది వరకు విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలకు సంబంధించి రెవెన్యూ పోలీస్ మెడికల్ విద్యుత్ మొదలగు అన్ని శాఖల వారి సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడమైనది.విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందు పరీక్షా కేంద్రమునకు చేరుకోవాలని సూచించారు.పరీక్షల సమయంలో విద్యార్థులు చదివినది పునఃశ్చరణతో పాటుగా సరైన ఆహారం తగినంత నిద్ర సమయ పాలన పాటించే విధంగా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోగలరని కోరారు.ప్రతి సంవత్సరం లాగా కాకుండా ఈ సంవత్సరం పరీక్షల టైం టేబుల్ లో వచ్చిన మార్పులు విద్యార్థులు గమనించి ఆయా తేదీలలో పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు.

## మాతృ భాష ను మరువ వద్దు




**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 21(వార్తాప్రభ)** మద్దాయి కుంట జడ్పీ హై స్కూల్ నందు అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకలు ఘనంగా హెచ్ఎం దారపు రెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అత్యంత ప్రాచీన భాష అయిన తెలుగు ఉగ్గు పాల లాంటి జోలపాటలతో మొదలై అష్టావధానం పద్య సాహిత్యం వరకు తన ప్రయాణాన్ని కొనసాగించి తల్లి లాంటి భాషగా మన తెలుగు భాష ఎప్పటికీ గుర్తుంటుందని విద్యార్థులకు తెలిపారు. జీవితంలో ఎంత ఉన్నత స్థితికి ఎదిగిన అమ్మని మరిచిపోనట్టు మనం మాతృభాషను కూడా మరువవద్దు అని సూచించారు. పరభాష జ్ఞానాన్ని సంపాదించి ఉద్యోగాలు పొందిన మన భాషలోనే మనం మాట్లాడుకోవడం ద్వారా ఆత్మీయత తీయదనం లభిస్తుందని ఎంతోమంది తెలుగు కవులు వివిధ పద్యాల ద్వారా మనకు తెలియజేశారు. తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన శ్రీకృష్ణదేవరాయలు, ప్రాచీన కవులు నన్నయ, తిక్కన, ఎర్రన, పోతన శ్రీనాథుడు వంటి వారు ఆధునిక కవులైన రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, సి నారాయణ రెడ్డి, రావూరి భరద్వాజ, మొల్ల, తిరుపతి వెంకట కవులు మొదలైన ప్రముఖ కవులు అందరూ భాషా సౌందర్యాన్ని తెలపగా, వేమన పద్యాలు, సుమతి శతకాలు, ద్వారా తెలుగు భాషకు విశేష సేవలు అందించారు. తెలుగు ఉపాధ్యాయులు యు శివ నాగరాజు మాట్లాడుతూ మాతృభాష, మాతృదేశాన్ని మరిచినట్లయితే మనం మనుషులమే అనిపించుకోమని కావున ప్రతి ఒక్కరూ తెలుగు భాష గొప్పతనాన్ని తెలుసుకోవాలని విద్యార్థిని, విద్యార్థులు చేత వివిధ పద్యాలు చెప్పించారు. ఈ కార్యక్రమానికి మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు తో మాండ్రు యువరాజు, పాగోలు నాగేందర్ రావులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆంగ్లంలో స్పెల్ బీ కాంపిటీషన్

***మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేత***



**చేజర్ల ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)** చేజర్ల మండల పరిధిలోని ఆదూరుపల్లి క్లస్టర్ పరిధిలో 4 మరియు 5వ తరగతుల విద్యార్థులకు ఆంగ్లంలో స్పెల్ బి కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది.ఈ కాంపిటీషన్ కు క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలల నుండి ముగ్గురు విద్యార్థులు ఒక టీం చొప్పున పాల్గొన్నారు. విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని ఆంగ్ల పదాలకు స్పెల్లింగ్ చెప్పడం జరిగింది.ఈ పోటీలో యన్ వి కండ్రిక జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు.వీరిని ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖాధికారులు ఇందిరా డిసి మస్తానయ్య పాల్గొన్నారు.క్లస్టర్ ప్రధానోపాధ్యా యులు జివి రమేష్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.మొదటి మూడు స్థానాలు సాధించిన పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఆదూరుపల్లి క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మన ఊరి బడిని కాపాడుకుందాం - ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం.




**గిద్దలూరు,** ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)** కొమరోలు టౌన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు యూ.టీ.ఎఫ్ కొమరోలు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన "ఊరి బడిని కాపాడుకుందాం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు, పద్మజ, జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య లు పాల్గొని ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం, మన ఊరి బడిని కాపాడుకుందాం.. అనే నినాదంతో యూ.టీ.ఎఫ్ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్టర్ను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన ఊరి బడిలో మన విద్యార్థులను చేర్చుకొని పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఉచిత మధ్యాహ్నం భోజన వసతి, ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు బుక్స్, ఉచిత యూనిఫాం, బూట్లు, బెల్టు మొదలైనవి అందిస్తూ, తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశా లలో వారి పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంఘ బాధ్యులు బాలయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జనార్ధన రాజు, షరీఫ్ తదితరులు పాల్గొని పోస్టరును ఆవిష్కరించారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాళ్ళను విజయ వంతం చేయాండి.

***అధికారుల సమీక్షా సమావేశంలో ఆర్.డి. ఓ.బాలకృష్ణ.....***





**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 21( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి కీ మార్చి 7 తేదీన జరుగు పుట్టింటి పసుపు కుంకుమ బండ్లు అనిగండ్ల పాడు నుండి రానున్న సందర్భంగా శనివారం శ్రీ తిరుపతమ్మ దేవస్థానము నందు నిర్వహించనున్న నందిగామ రెవిన్యూ డివిజన్ అధికారి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సమావేశం లో ఆర్డీఓ కె. బాలకృష్ణ అన్ని శాఖల వారు అమ్మవారి చిన్న తిరునాళ్ళు మహోత్సవమును విజయవంతం చేయవలసినదిగా వివిధ శాఖల అధికారులకు మరియు సిబ్బందికి తగు సూచనలు సలహాలు జారీ చేయుట జరిగినది.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి,,బి. మహేశ్వర రెడ్డి మండల తహసీల్దార్ శాంతి లక్ష్మి , ఎంపీడీఓ జీ ,శ్రీను,ఎస్ ఐ అర్జున్ , డాక్టర్ నాగరాణి , అగ్నిమాపక సిబ్బంది , కార్యనిర్వహక ఇంజనీరు డి. రమా, మరియు వివిధల శాఖల సిబ్బంది పాల్గొన్నారు. సమన్వయ సమావేశము ది.26/02/2026 మ.గం.03.00 లకు మరలా నిర్వహించుట జరుగునని ఆర్ డి ఓ తెలిపారు.తప్పని సరిగా అన్నీ శాఖల అధికారులు పాల్గొని వారి శాఖ పని,సూచనలు,విధివిధానాలు తెలియ జేయాలని ఆర్ డి ఓ తెలిపారు...

## జీవో 77 రద్దు చేయాలి: పీడీఎస్యూ

**రాయదుర్గం ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఫిబ్రవరి 27న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) పిలుపునిచ్చింది. కణేకల్ పట్టణంలో పీడీఎస్యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను విడుదల చేశారు.

# అజాత శత్రువు, పశువుల సంత వ్యవస్థాపకులు

## అయినంపూడి సుబ్బారావు కన్నుమూత



హనుమాన్ జంక్షన్,పిబ్రవరి 21(వార్తాప్రభ)హనుమాన్ జంక్షన్ పశువుల సంత వ్యవస్థాపకులు, బాపులపాడు మాజీ సర్పంచ్ కాకాని అరుణ తండ్రి, కాకాని బాబు మామ అయినంపూడి సుబ్బారావు( 90 ) శుక్రవారం రాత్రి కన్ను మూశారు. 70 సంవత్సరాల క్రితమే సుబ్బారావు హనుమాన్ జంక్షన్ లో పశువుల సంత ను ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి సంత నిర్వహిస్తున్నారు. అయినంపూడి సుబ్బారావు కు అరుణ ఒక్కతే కుమార్తె వివాహం అయిననాటి నుండి కాకాని బాబు సంత నిర్వహణలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. శనివారం ఉదయం ఆయన అంత్యక్రియలు హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లో నిర్వహించారు. పలువురు ప్రముఖులు అభిమానులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వీరిలో చలమలశెట్టి రమేష్ బాబు,సుంకర సుభాష్ చంద్రబోస్,వీరమాచినేని సత్యప్రసాద్,అట్లూరి శ్రీనివాసరావు, మారుబోయిన కోటేశ్వరరావు,డాక్టర్ గోగినేని బాలాజీ,దుట్టా శివన్నారాయణ, వేమూరి శ్రీనివాసరావు,చిలకపాటి పండు,వేగిరెడ్డి నాని,బోయపాటి పూర్ణచంద్రరావు, కొండపావులూరి రమేష్,అక్కినేని , వీరమాచినేని నాగయ్య, షేక్ అబీద్,అబ్దుల్ బారి, గరికపాటి ఉమా, మిక్కిలినేని మురళి, తదితరులు పాల్గొన్నారు

# గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి...



**గుడ్లవల్లేరు:**ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)గ్రామాలను పరిపూర్ణంగా ఉంచుకోవడంలో ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ కోరారు. శనివారం గుడ్డవల్లేరుతో పాటు కౌతవరంలో నిర్వహించిన శానిటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలిస్తూ, చెత్త నిర్వహణ, మురుగు కాలువలను శుభ్రపరిచే పనులు, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించే చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలు శుభ్రంగా ఉండటం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు ఏజేల్ నరసింహారావు, బలగం వెంకటరమణ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం



**కృత్తివెన్ను ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ మాతృభాష ప్రాముఖ్యతను గుర్తించడం,భాషా పరిరక్షణ మరియు అంతరించిపోతున్న భాషలను కాపాడుకోవడం,అలాగే విద్యలో మాతృ భాష యొక్క ప్రాధాన్యత ను నొక్కి చెప్పడం మాతృ భాషా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని,మన జీవితంలోఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా అమ్మను మరచిపోకూడదు,అమ్మ భాషనూ మరువకూడదని ఆయన అన్నారు. 1952 ఫిబ్రవరి 21 లో బంగ్లాదేశ్ లో బెంగాలీ భాష గుర్తింపు కోసం జరిగిన పోరాటంలో అమరులైన విద్యార్థుల త్యాగానికి గుర్తుగా ఈ రోజును ఎంచుకున్నారని,ఈ రోజు ప్రాముఖ్యతను గుర్తించిన (యునెస్కో)1999 నవంబర్ లో ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని,2000 సంవత్సరం నుండి ఫిబ్రవరి 21 ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మాతృభాషా దినంగా జరుపుకుంటున్నారని సూర్య ప్రకాష్ అన్నారు. ఈ కార్య క్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు టి వి వి ప్రసాదు, ఉపాధ్యాయులు యేసు పాదం, విజయ్ కుమార్, మురళీ కృష్ణ, ప్రభ రేఖ దుర్గా జ్యోతి త్రివేణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతృభాష లేనిదే మానవజాతి మనుగడ లేదు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** మాతృభాష లేనిదే మానవ జాతి మనుగడ లేదని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి క్రాంతి హై స్కూల్ లో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం లేనివాడు విజ్ఞానాన్ని సంపాదించలేడన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు మాతృభాషలోనే సాధ్యపడతాయన్నారు. క్రాంతి హై స్కూల్ హెడ్ మాస్టర్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శాంతివన్ యోగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లంకె జనార్దన్, స్కూల్ డైరెక్టర్ వెనిగళ్ల మురళీమోహన్, ప్రిన్సిపాల్ అమ్మాజీ, తెలుగు ఉపాధ్యాయులు ఏడుకొండలు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణదేవరాయ విద్యా, సాంస్కృతిక సంఘం స్వర్ణోత్సవ వేడుకలు




**తిరుపతి:**ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యా సహాయం మరియు నైపుణ్యాభివృద్ధి ద్వారా సాధికారత కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న కృష్ణదేవరాయ విద్యా మరియు సాంస్కృతిక సంఘం తన స్వర్ణోత్సవాన్ని ఈరోజు తిరుపతి కరకంబాడిలోని అమరరాజా క్యాంపస్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించింది. 1960ల చివర్లో స్థాపించబడిన ఈ సంఘం 1974లో అధికారికంగా నమోదు చేయబడింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన యువతకు విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో గత ఐదు దశాబ్దాలుగా నిరంతర సేవలందిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ. 5 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ 3,600 మందికి పైగా విద్యార్థులకు మద్దతు అందించింది. ప్రతి సంవత్సరం సుమారు 250 మంది విద్యార్థులు రూ. 50 లక్షల విలువైన విద్యా వేతనాలను పొందుతున్నారు. గల్లా అరుణ కుమారి మరియు డా. గల్లా రామచంద్ర నాయుడు , పి. రాజగోపాల్ నాయుడు ప్రేరణతో 1969లో పునాది వేశారు. సమాజ అభివృద్ధి ప్రజల విద్యపై ఆధారపడి ఉంటుందనే విశ్వాసంతో గ్రామీణ యువతకు నాణ్యమైన విద్య అందించడమే కాక, ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో సంఘం కృషి చేస్తోంది. స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా వ్యవస్థాపక సభ్యురాలు గల్లా అరుణ కుమారి గారు తన ఆత్మకథ ద్వారా వచ్చిన ఆదాయంలో నుంచి రూ. 1 కోటి విరాళంగా ప్రకటించడం సభలో విశేష ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కె. రామమోహన్ నాయుడు మాట్లాడుతూ "ప్రతిభావంతులైన గ్రామీణ యువతకు అవకాశాలు కల్పిస్తే వారు దేశాన్నే ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలరు. గత ఐదు దశాబ్దాలుగా కేవలం విద్యా వేతనాలు మాత్రమే కాక, సామాజిక మార్పు కోసం ఒక ఉద్యమంగా పనిచేస్తోంది. ఒక విద్యార్థి జీవితాన్ని మార్చడం అంటే ఒక కుటుంబాన్ని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడం" అని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి శ్రీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ, సమాజానికి తిరిగి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యా రంగానికి తన మద్దతు కొనసాగుతుందని తెలిపారు. వ్యవస్థాపక సభ్యుడు డా. గల్లా రామచంద్ర నాయుడు ప్రయాణాన్ని స్మరించుకుంటూ, "ఒక విద్యార్థికి సహాయం చేయడం ద్వారా ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు వేల కుటుంబాలకు దీప్తిమంతమైన మార్గదర్శకంగా మారింది. భవిష్యత్తులో వ్యక్తిత్వ వికాసం మరియు సమగ్ర శిక్షణపై మరింత దృష్టి సారిస్తాం" అని తెలిపారు. మంత్రివర్యులు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ప్రముఖ రచయిత శాకం నాగరాజు గారు రచించిన ప్రజల మనిషి రాజన్న అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జయభేరి గ్రూప్ ఛైర్మన్, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ , చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, అమరరాజా గ్రూప్ ఛైర్మన్ ,మాజీ ఎంపీ గల్లా జయదేవ్, ప్రస్తుత అధ్యక్షురాలు డా. రమాదేవి గౌరినేని , సమస్త సెక్రటరీ ఎల్ మహదేవ నాయుడు, ఉపాధ్యక్షుడు ఉమాకాంత్ , ట్రెజరర్ రాళ్లపల్లి సతీష్ , సంయుక్త కార్యదర్శి బాలాజీ కిరణ్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో సత్తా చాటిన బట్టేపాడు హైస్కూల్ విద్యార్థినిలు



**ఆత్మకూరు ఫిబ్రవరి 21 (వార్తాప్రభ)** బట్టేపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి పాఠశాలకు గర్వకారణ మయ్యారు. అండర్-17 అండర్-15 విభాగాల్లో బంగారు కాంస్య పతకాలు సాధించిన విద్యార్థినీలను మరియు వారికి శిక్షణనందించిన పీడీ కావాటి వెంకటకృష్ణయ్యను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మెరిసిన విద్యార్థినీలు 9వ తరగతి విద్యార్థిని సి. హెచ్. రాణి అండర్-17 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాల కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటింది. అలాగే 8వ తరగతి విద్యార్థినీలు వి. పల్లవి యు. అలేఖ్య అండర్-15 విభాగంలో కాంస్య పతకాలు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ విజయాలకు క్రీడా ఉపాధ్యాయుడు పీడీ వెంకటకృష్ణయ్య అందించిన కఠిన శిక్షణే కారణమని ఉపాధ్యాయులు తెలిపారు. సన్మాన కార్యక్రమానికి టిడిపి ఎంపీటీసీ తూమాటి శశిధర్ రెడ్డి ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షులు నున్న సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు పూలు చల్లి అతిథులను వేదికపైకి ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. విజేతలకు బహుమతులు అందజేసి శాలువాలతో సత్కరించారు. హెడ్మాస్టర్ డి. భార్గవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం గర్వకారణమని అన్నారు. అలాగే పిడి వెంకట కృష్ణయ్య ఏ పాఠశాలలో ఉంటే ఆ స్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉంటుందని అన్నారు. పాఠశాల క్రీడా విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థినీలు ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



**విజయవాడ ఫిబ్రవరి 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ ఒన్‌టౌన్‌లోని కాకరపర్తి భావన్నారాయణ కాలేజ్ (కెబిఎన్)లో ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్-విజయవాడ వారి ఆధ్వర్యంలో నాసా ఆసుపత్రి, వాసన్ ఐకేర్, లలిత డెంటల్ మల్టీ స్పెషాలిటీ, ఎఐఐ ఆసుపత్రుల సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. నాసా, వాసన్ఐ కేర్, లలిత డెంటల్ మల్టీ స్పెషాలిటీ, ఎఐఐ ఆసుపత్రుల నుంచి డాక్టర్లు తమ బృందాలతో కలిసి రోగులకు వైద్యసేవలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కెబిఎన్, బిఇడి, హిందూ హైస్కూల్, పొట్టి శ్రీరాములు, చలువాది మల్లిఖార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఒన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజానీకం వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కెబిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్‌క్లబ్, ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ తరఫున ఆయా ఆసుపత్రుల సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాలంటీర్లు తదితరులు పాల్గన్నారు. నాసా ఆసుపత్రి యూనిట్ హెడ్ ఆపరేషన్స్ డాక్టర్ పి.వి.జ్యోతి ఆనంద , ఎల్ఐసి సిబి-1 ఉద్యోగి కె.వి.శ్రీనివాసరావు, లలిత మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ కె.నిఖిత, కెబిఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు, కెబిఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.ఎల్.రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్‌కుమార్, ఎం.శాంతిబాబు, పి.గౌతమీదేవి తదితరులు పాల్గన్నారు. మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించిన ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను ఎన్‌టిఆర్ జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.భానునాయక్ అభినందించారు.

పేదలకు నిరంతరం సేవా కార్యక్రమాలుఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఎల్ఐసి విజయవాడ (గవర్నరుపేట) సిటీ బ్రాంచి-1 ఉద్యోగి రాసంశెట్టి నందకిశోర్ అన్నారు.

**ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి :నందకిశోర్**

మారుతున్న జీవనశైలితో నిరంతరం వ్యాధుల ఉధృతి పెరుగుతున్నందున ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అత్యధిక శ్రద్ధ వహించాలని నందకిశోర్ అన్నారు. వరదలు, తుపాన్లు, అగ్నిప్రమాదాలు వంటివి సంభవించిన సమాయాల్లో బాధితులకు ఆర్థికంగా, వస్తు, సామాగ్రి రూపేణా పంపిణీచేసి ఆదుకుంటున్నారు. ఏటేటా పేద విద్యార్థుల చదువు నిమిత్తం కూడా ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఏటేటా పలు వైద్యశిబిరాలు ఏర్పాటుచేయటం ద్వారా వేలాదిమంది పేదలకు ఉచితంగా కార్పొరేట్, ప్రయివేటు వైద్యసేవలు అందేలా కృషిచేస్తున్నామన్నారు. నేటి సమాజంలో వైద్యం అత్యంత ఖరీదైన సమయంలో తమవంత సాయంగా ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల సౌజన్యంతో గత కొన్నేళ్లుగా ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తూ పేదలకు ఉచితంగా నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలు అందేలా కృషిచేస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు కెబిఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించటా నికి రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రయివేటు సంస్థలు, ట్రస్టులు, అసోసియేషన్లు ఉచిత మెగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేయటం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు కూడా అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కె.బిఎన్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా విజయవాడ నగరంలోని ప్రముఖ కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో కలిపి తమ కళాశాలలో పెద్దఎత్తున ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తూ పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా కృషిచేస్తున్నామన్నారు. రెండు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ రాసంశెట్టి తనూజరాణి మాట్లాడుతూ గతరెండు దశాబ్దాలుగా తమ ట్రస్ట్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా నేటికీ పేదరికం తాలూకా ఆనవాళ్లు ఉన్నాయన్నారు. తమ వంతుగా అభాగ్యులు, పేదలకు ఆర్థిక సహాయం, దుస్తుల పంపిణీ, వంట సామాగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు ఇప్పటికే వందలాదిగా చేశామన్నారు. ఏటేటా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమ సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు.

# కొండపల్లి మున్సిపాలిటీకి రూ.2.83 కోట్ల సీఎస్ఆర్ నిధులు

## - మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీకి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చొరవతో ఎన్టీటీపీఎస్ నుంచి సీఎస్ఆర్ నిధులు రూ. 2.83 కోట్లు విడుదలైనట్లు మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 - 26లో సుమారు రూ. 10.74 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆరు పనులకు పరిపాలనా అనుమతి లభించినట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో హిందూ శ్మశానవాటికను రూ. 93 లక్షలు, కొండపల్లిలో హిందూ శ్మశానవాటికను రూ. 60 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పారిశుధ్య వాహనాలకు రూ. 50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్న నేపథ్యంలో అదే స్ఫూర్తితో కొండపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శవంతమైన మున్సిపాలిటీ తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు. కౌన్సిలర్లు చనమోలు నారాయణరావు. ధరణికోట విజయలక్ష్మి, కూటమి నాయకులు మైలా సైదులు, బాడిశ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భద్రత, శ్రేయస్సు కూటమి ప్రభుత్వ విధి

## రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్ ,** ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ గొడారి గుంట రూరల్ శాసనభ్యులు వారి కార్యాలయం వద్ద 12 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన సుమారు 7 లక్షల 72 వేల 651 ముఖ్య మంత్రి సహాయ నిధి (సిఎంఆర్ ఎఫ్) చెక్ లను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన చెక్కుల పంపిణీలో ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని కొన్నింటికి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక బరోసా కల్పిస్తున్నారని, ఇప్పటివరకు నియోజకవర్గం వ్యాప్తంగా 303 దరఖాస్తులు సీఎంఓ కార్యాలయానికి పంపగా నేటికీ 208 మంది లబ్దిదారులకు సుమారు రూ. 2 కోట్ల ఆర్థిక బరోసా కల్పించామని, మిగిలిన 95 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, కుటుంబంలో అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక బరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శిరంగు శ్రీనివాస్, నల్లే ప్రసన్న,కరెడ్ల గోవింద్, నల్లం శ్రీరాములు,సోదే ముసలయ్య ,పాంద్రంకి రాజు,యాళ్ల పండు, పేపకాయల అంజి, కోనేటి రామకృష్ణ, గౌతమ్, అనుకూల రాంబాబు, అన్నవరం,జోకా తాతాజీ , గండి వెంకటేశ్వర రావు, సంఘాడి శ్రీను,రెడ్డి లోవరాజు,గీశాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలకు వ్యతిరేకంగా 9 వ వార్డులో అవగాహనా సదస్సు



**పెడన వార్తప్రభ ఫిబ్రవరి 21:** ఆంధ్ర రాష్ట్రాన్ని బాల్యవివాహాల రహితంగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పవల్లి అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం నాడు పెడన పట్టణం తోటమూల 9 వ వార్డులో హెచ్ డబ్ల్యూ హెచ్ సి అంగన్వాడీ కేంద్రాలలో సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పవల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు చదువు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. బాల్యవివాహాలు అనాగరిక చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి విజయలక్ష్మి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# మార్చి 4 నుండి 8 వరకు శ్రీ తిరుపతమ్మ చిన్న తిరునాళ్ళ

## గోడ పత్రిక ను విడుదల చేసిన ఆలయ ఈ.ఓ. మహేశ్వర రెడ్డి



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 21( వార్త ప్రభ )** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు ది.04.03.2026 నుండి ది.08.03.2026 వరకు నిర్వహించనున్న శ్రీ అమ్మవారి చిన్న తిరునాళ్ళ -2026 నకు సంబంధించిన గోడపత్రికను బి మహేశ్వర్ రెడ్డి ఉప కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి చే ఆవిష్కరించడం జరిగినది . ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహక ఇంజనీర్ వారు, సహాయ కార్యనిర్వహణ అధికారి రమా, ప్రధాన అర్చకులు మాగ్రెబోయిన గోపి బాబు , ఆలయ ఏ.ఈ.ఓ. జంగం శ్రీనివాస రావు,అర్చకులు, పురోహితులు శివరాం బోట్ల ఆంజనేయ శర్మ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు...

# శ్రీసిటీని సందర్శించిన మాజీ డీజీపీ



**తిరుపతి:**ఫిబ్రవరి 21 **:(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డా. ఎం.మాలకొండయ్య శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ఇతర కార్యకలాపాలను వివరించారు. శ్రీసిటీ విజన్, ప్రణాళిక, అమలు తీరును ప్రశంసించిన డా. మాలకొండయ్య, దేశంలో ఆదర్శ పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానికులకు, మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు డా. రవీంద్ర సన్నారెడ్డి మరియు ఆయన బృందాన్ని అభినందించారు. స్థిరమైన అభివృద్ధి చర్యలు, సిఎస్ఆర్ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని కొనియాడారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన పారిశ్రామిక కేంద్రంగా మలచడం అభినందనీయమని తెలిపారు. సందర్శనలో భాగంగా ఆయన ఇసుజు, మోండెలీజ్, బ్లూస్టార్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించి, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. అలాగే క్రియా యూనివర్సిటీ, చిన్మయ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. డా. మాలకొండయ్యను శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బివి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి, ఈ ప్రాంతంలో అమలవుతున్న భద్రతా చర్యలు మరియు శాంతి భద్రతల పరిస్థితులను వివరించారు.

# గోదావరి జలాలతో డెల్టా రైతాంగానికి రెండు పంటలకు నీరు : ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము

● మోటూరులో రూ॥ 23.75 లక్షలతో ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు..





**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పోలవరం నిర్మాణ పనులు చేరుకున్నాయని ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో రూ.23.75 లక్షల నిధులతో పునర్ నిర్మిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలసౌరి, శాసనసభ్యులు వెనిగండ్ల రాము లు భూమి పూజ నిర్వహించి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ బాలసౌరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలను పరిష్కరించడం, రైతాంగానికి స్థిరమైన అయుకట్టు అందించడమే లక్ష్యంగా విరివిగా ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని అన్నారు. పోలవరం నిర్మాణంతో డెల్టాకు సమృద్ధిగా గోదావరి జలాల రాకతో ,రైతాంగం రెండు పంటలతో సుభిక్షంగా ఉంటారని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కూటమికి మద్దతుగా నిలిచిన మోటూరు గ్రామ అభివృద్ధికి.. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు చేసామన్నారు. ఏడేళ్లుగా ప్రయత్నిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఒక్క మోటూరు గ్రామంలోనే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు త్రాగునీటి, సాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ వేసవి సీజన్లో మోటూరు త్రాగునీటి చెరువును అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్.డబ్ల్యూ.సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టిడిపి అధ్యక్షుడు వాసే మురళి,ఎంపీపీ గద్దె పుష్ప రాణి, ఎండిఓ విష్ణు ప్రసాద్, మండల సర్పంచ్ కూరగంటి పద్మ, ఎంపీటీసీ గొర్రె వరలక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ చీకటి శేషగిరి రావు, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, జనసేన నాయకులు చందు రెడ్డి, ఇరిగేషన్ డిఈ భరత్, బీసీ చైర్మన్ నానారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు, పార్టీ నాయకులు గొర్రె రంగ, గంటా బాలాజీ, చలమలశెట్టి సాయి, గంటా చైతన్య, యార్లగడ్డ తేజ, గంట లక్ష్మణ్, గండికోట పాండు, కటారి ప్రసాదు, కాట్రగడ్డ రాజేష్, ముప్వా నాగేశ్వరరావు, మానేపల్లి సురేష్, ఇరిగేషన్, మండల పరిషత్, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేసుల సత్వర పరిష్కార మార్గమే లక్ష్యంగా.. మార్చి 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** కేసుల సత్వర పరిష్కార మార్గమే లక్ష్యంగా మార్చి 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ కమిటీ చైర్మన్ జి. సుబ్రహ్మణ్యం సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల ప్రకారం మార్చి 14వ తేది 2026న జరుగు జాతీయ లోక్ అదాలత్ నిమిత్తం శుక్రవారం న్యాయవాదులతో.. అలాగే ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులందరూ అన్ని రాజీ పడదగు కేసులలో రాజీ చేసుకోవాల్సిందిగా సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. ఈ క్రమంలో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలనీ కోరుతూ ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు న్యాయవాదులను లేదా పోలీసు అధికారులను సంప్రదించాలనీ, ఈ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం తెలియజేసారు.



# పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన

● పర్యావరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.. మున్సిపల్ కమీషనరు మనోహార్




**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ శనివారం స్థానిక ఏజికే మున్సిపల్ హై స్కూల్ లో నిర్వహించిన సాసా (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, ఘన వ్యర్థాలు, ఈ-వేస్ట్ మరియు హానికర వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రత మరియు వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంపొందించేందుకు త్వరలోనే వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధి లోని మిగతా వార్డులలో కూడా పాఠశాలల్లో సచివాలయం సిబ్బంది విద్యార్థులకు పరిశుభ్రత మరియు వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రతపై చైతన్యవం తుల్తె, తమ ఇళ్లలో మరియు పరిసర ప్రాంతాల్లో కూడా చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలు పాటిద్దాం.. అగ్ని ప్రమాదాలను అరికడదాం..

● గుడివాడ అగ్నిమాపక కేంద్రం వారీ ఆధ్వర్యంలో విద్యార్థులకు తగిన జాగ్రత్తలపై అవగాహన..





**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** స్థానిక అగ్నిమాపక కేంద్రమునందు ఈనెల 16వ తేది నుండి 21వ తేది వరకు ఆరు రోజుల నుండి విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6వ, 7వ తరగతి విద్యార్ధిని విద్యార్థులకు మరియు స్కూల్ సిబ్బందికి స్కూల్ లో అగ్ని ప్రమాదాలు జరగకుండ తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక శాఖ రోజువారి కార్యకలాపాలు, వాహనాలు మరియు పరికరాల పనితీరు గురించి విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించబడింది. ఇందులో స్కూల్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు విద్యార్థులు భయపడకుండా క్రమపద్ధతిలో బహిరంగ ప్రదేశానికి చేరుకోవాలి. పొగ/మంటల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించి, అవసరమైతే కృత్రిమ శ్వాస అందించుట గురించి.. అగ్నిప్రమాద సమయంలో లిఫ్ట్ లను ఉపయోగించరాదు మెట్ల మార్గం మాత్రమే ఉపయోగించాలి. అగ్నిప్రమాద సమయంలో గది మూలలు లేదా టాయిలెట్లలో దాక్కోవద్దని సూచించబడింది. అంగవైకల్యమున్నవారు, వృద్ధులు మరియు చిన్నపిల్లలను ముందుగా సురక్షితంగా బయటకు తీసుకురావాలి. విద్యుత్ అగ్నిప్రమాదాల సమయంలో నీటిని ఉపయోగించరాదు. ముందుగా ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్‌ను ఆపి, పొడి ఇసుక లేదా డ్రై కెమికల్ పౌడర్‌తో మంటలను ఆర్పాలి. వంటగదిలో గ్యాస్ లీక్ జరిగినపుడు గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయడం, సిలిండర్‌ను బహిరంగ ప్రదేశానికి తీసుకెళ్లడం మరియు మంటలు వ్యాపించినపుడు తడిపిన గోనె పట్టా/దుప్పటి/మట్టి/ఇసుకతో మంటలను ఆర్పే విధానం ప్రదర్శించబడింది. శరీరానికి మంటలు అంటుకున్నప్పుడు పరుగెత్తకుండా వెంటనే "స్టాప్ డ్రాప్ రోల్" విధానాన్ని పాటించాలి. దళసరి దుప్పటి లేదా రగ్గుతో కప్పుకోవాలి. అగ్నిమాపక సిబ్బంది ఉపయోగించే పరికరాలతో మంటలను ఎలా ఆర్పుతారో ప్రత్యక్ష ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గారు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలే లయన్స్ క్లబ్ ముఖ్య ఉద్దేశం..

## -జిల్లా గవర్నర్ వివిపిఎస్ఆంజనేయులు





**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** సామాజిక సేవలు గుర్తించి అనుగుణంగా సేవలందించడంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ముఖ్యపాత్ర వహిస్తుందని జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు అన్నారు. హనుమాన్ జంక్షన్ లైన్స్ క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా శనివారం వివిధ సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పెరికిడు ముక్తి కాంతా సమేత ముక్తేశ్వరాలయంలో పూజలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. బాపులపాడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో అవిర్నేని తారక బ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ కార్యక్రమంలో ఆంజనేయులు, లక్ష్మీ శ్రీ, దంపతులు చైర్మన్ అవిర్నేని రాధాకృష్ణ నందిగం స్వామితో కలిసి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ, స్వామి ఆలయంలో ఆంజనేయులు, లక్ష్మీ శ్రీ, దంపతులు లయన్స్ క్లబ్ సభ్యులు తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెడివాలి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో లయన్స్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరిశీలించారు. తదనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 200పైగా దేశాల్లో సేవలందిస్తూ అత్యవసర సమయాల్లో కోట్లాది రూపాయల వితరణతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సేవలందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి, కార్యదర్శి మాకినేని శ్రీనివాస్, కోశాధికారి అక్కినేని రాఘవేంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చక్రధర్, శ్రీనివాస్, నందిగం స్వామి అక్కినేని శ్రీనివాస్ ఫణీంద్ర, ఆళ్ళ గోపాలకృష్ణ, నందూరి శర్మ ,మేడికొండ బుచ్చి పాపయ్య, కలపాల రంగారావు, చలసాని వెంకటేశ్వరరావు, బోయపాటి పూర్ణచంద్రరావు, కల్లేపల్లి నారాయణరావు, మత్తి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# మానవతా గుడివాడ వారీ అధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

## గుడివాడ ఎస్ పి ఎస్ స్కూల్ తెలుగు పండిట్‌లకు ఘన సత్కారం..



**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా గుడివాడలోని ఎస్పి ఎస్ స్కూల్ నందు చంద్రశేఖర్, నాగబాబు, వందనా దేవి తెలుగు పండిట్లకు ముగ్గురికి.. సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి గారి అధ్వర్యంలో జరగడం ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరు వీర శేషగిరిరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి గుడివాడ మానవతా సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కోశాధికారి రాధాకృష్ణ జాయింట్ సెక్రెటరీ వెంకట మోహనరావు, బొగ్గవరపు తిరుపతయ్య , కోన రామారావు, మెరుగు మాల బ్రహ్మయ్య, గరికిపాటి సాంబశివరావు మరదాని వెంకటేశ్వరరావు, సామి రామ్మోహన్రావు ఎంఈఓ రామచంద్రరావు శైలజ భద్ర, హైమావతి, రాజగోపాల్, హెచ్ఎం శ్రీనివాసరావు స్టాఫ్ సమక్షంలో ఆ ముగ్గురు పండిట్లకు దుశ్శాలువతో, పూలతో జ్ఞాపికలతో సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా వక్తలు మాతృభాష దినోత్సవ ప్రాముఖ్యత తెలియజేయడం జరిగినది. ముఖ్యముగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా డిబేట్ నిర్వహించడం ప్రథమ ద్వితీయ బహుమతులు అదే రీతిగా వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ ద్వితీయ బహుమతులు, మానవత స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున అందించడము జ్ఞాపికలతో మరియు అప్రీషియన్ సర్టిఫికెట్స్ తో విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడానికి అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సహకరించిన స్కూలు యాజమాన్యానికి స్టాఫ్‌నకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధన్యవాదములు తెలియజేశారు.

**జాతీయ సీనియర్ సిటిజన్స్ కాన్ఫిడరేషన్ నకు ఉపాధ్యక్షుడు దండమూడి.. :** ఒరిస్సా లోని భువనేశ్వర్ లో జాతీయ సీనియర్ సిటిజన్స్ కాన్ఫిడరేషన్ మీటింగ్ నకు కృష్ణాజిల్లా నుండి ఒరిస్సా లోని భువనేశ్వర్ లో ఫిబ్రవరి నెల 22, 23వ తారీకులలో జరుగు మీటింగు నకు గుడివాడ నుండి సీనియర్ సిటిజన్స్ ఉపాధ్యక్షుడు అయిన దండమూడి సీతారామస్వామి ని ప్రతినిధిగా పంపడం జరుగుతున్నదని సీనియర్ సిటిజన్స్ కృష్ణా డిస్ట్రిక్ట్ మచిలీపట్నం కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ గంగాజలరావు తెలిపారు. ఆ మీటింగ్ లో పాల్గొని సీనియర్ సిటిజన్స్ సమస్యలు వివరిస్తారని ఆశిస్తున్నాము. ఈరోజు అనగా 21తేదీన మన ఎన్టీఆర్ జిల్లా సెక్రెటరీ మోత్కూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ నుండి బయలుదేరి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా కేంద్రాలవద్ద అన్ని ఏర్పాట్లు కల్పించాం



**మైలవరం,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** ఈనెల 23 నుంచి జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వేములూరు వెంకటరత్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ శనివారం తెలిపారు.ఈ పరీక్షా కేంద్రంలో గరిష్టం గా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 324 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 264 మందితో వెరసి మొత్తం 588 మంది పరీక్షలు రాయబోతు న్నట్లు తెలియజేశారు.ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు కొనసాగుతాయని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, అధికారుల ఆదేశాల మేరకు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు అన్నారు.పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 (163బి) సెక్షన్ అమలుతో పటిష్ట బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబ దవని తెలిపారు.మినరల్ వాటర్, ప్రతి గదిలో నూ లైట్లు ఫ్యాన్లతో సరైన వెంటిలేషన్, వాష్ రూమ్స్, మెడికల్ సిబ్బందితో ఫస్ట్ ఎయిడ్ మొదలైన మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతోందని వెల్లడించారు. వైకల్యం కలిగిన ప్రత్యేక అవసరాలు గల (సి డబ్ల్యూ ఎస్ ఎన్) విద్యార్థులకు కళాశాల మొదటి అంతస్తులోనే ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి మాస్ కాపీయింగ్ కు పాల్పడరాదని, మాల్ ప్రాక్టీస్ కింద కేసులు బుక్ చేయడం జరుగుతుందని తెలిపారు.

# నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

● కీ॥శే॥ ఎంఆర్ నాగేశ్వరరావు సాహితీ స్ఫూర్తి పురస్కారంతో వల్లభాపురం కిషోరుకు సత్కారం..



**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యాన ఈనెల 22వ తేది ఆదివారం సాయంత్రం 5గం॥లకు స్థానిక శ్రీనివాస మహల్ సెంటర్లోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి సమన్వయకర్త డిఆర్బి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతియేటా మాదిరిగానే కీ॥శే॥ ఎంఆర్ నాగేశ్వరరావు సాహితీ స్ఫూర్తి పురస్కారం 2026 అవార్డును విశ్రాంత ఉపాధ్యాయులు వల్లభాపురం కిషోర్‌కు అందజేయనున్నట్లు ప్రసాద్ తెలిపారు. పురస్కారానికి ఎంపికైన కిషోర్‌ను వంగీపురపు వీర రాఘవాచారి, చింతలూరి సత్యనారాయణ, డా॥ శ్రీనుబాబు, మోకా మాధవ రావు, ఎంవిజి ఆంజనేయులు, కోగంటి గాంధీబాబు తదితరులు అభినందించారు.

# నాటు సారా అమ్మకం దారులపై ఉక్కుపాదం మోపిన కృత్తివెన్ను పోలీసులు....



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు బందరు డిఎస్పి చప్పడి రాజా ఉత్తర్వులు ప్రకారం పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ ఎస్ ఐ పైడి బాబుకు అందిన సమాచారం మేరకు దండుదారి గ్రామంలో సారా తయారీదారుడు బొర్రా బాలకృష్ణ సన్నాఫ్ రామారావు(31) అతని అదుపులో తీసుకుని అతని వద్ద 5 లీటర్లు సారా మరియు 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేయడమైనది మరియు పడతడిక గ్రామంలో రెండు లీటర్ల సారా కలిగి ఉన్న మహిళను గుర్తించి ఆమెని అదుపులోకి తీసుకున్నట్లు. అలాగే రాజులపాటి కనకదుర్గ (55) సంవత్సరాలు కాగా ఆమె వద్ద నుండి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు. పై తెలిపిన రెండు ఘటనకు సంబంధించి కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఏ. పైడి బాబు హెచ్చరించారు.

# విద్యార్థులకు వీరవల్లి పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్ స్టేషన్ లో గీతాంజలి హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం ఎస్ ఐ సత్యం సురేష్ విద్యార్థులందరికీ కంప్లషీట్అంటే ఏంటి ఎఫ్ ఐ ఆర్ అంటే ఏంటీ,ఎఫ్ ఐ ఆర్ కట్టిన తరువాత ముద్దాయిని అరెస్ట్ చేయు విధానం అనంతరమ్ ఛార్జ్ షీట్,లాకప్,వి హెచ్ ఎఫ్ కమ్యూనికేషన్ సెట్ ఉపయోగాలు, పిస్టల్ వాడే విధానం.మరియు విద్యార్థులకు గుడ్ టచ్ -బ్యాడ్ టచ్,ర్యాగింగ్,డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం మరియు 112 కాల్ ద్వారా ప్రజలకు తక్షణం రక్షణ కల్పించే విధానం గురించి అవగాహనా కల్పిం చారు.

# కాంట్రాక్టర్ కు హౌసింగ్ మెరక బిల్లులు చెల్లించండి

**పెడన,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలో హౌసింగ్ కాలనీ మెరక చేసినందుకు సంబంధిత కాంట్రాక్టర్ కు వెంటనే బిల్లు చెల్లించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జయంత్ ఆశాఖ మానేజింగ్ డైరెక్టర్ ను ఆదేశించారు.ఫిబ్రవరి 2 న ఈ విషయమై సమాచార హక్కు చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాస్ ఫిర్యాదు చేసారు.67,1760 రూపాయలు సంబంధిత శాఖనుంచి కాంట్రాక్టర్కు చెల్లించవలసి ఉంది. కాలనీలో మెరక చేయడం తో పాటు అంతర్గత రహదారులను నిర్మించారు. ఈ సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్ కు కూడా అందజేశారు

# గుడివాడ -పెద ఎరుకపాడులో స్వచ్ఛభారత్..



**గుడివాడ,ఫిబ్రవరి 21 (వార్తాప్రభ) :** స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టిన గుడివాడ పట్టణ పెద్ద ఎరుకపాడు గ్రామస్తులు.. ! స్థానిక పెదఎరుకుపాడు వార్డులో రామిశెట్టి మురళి పర్యవేక్షణలో గ్రామస్తులు మరియు మున్సిపల్ కార్మికులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డా. మాచర్ల రామకృష్ణ (ఆర్.కె.) మాట్లాడుతూ మన గ్రామం మన శుభ్రత అనే నినాదంతో మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలియజేశారు. మన గుడివాడ పట్టణంలో కూడా మన ఊరు మన పరిశుభ్రత అనే ఆలోచనతో అందరూ వారానికి ఒకసారి మున్సిపల్ కార్మికులతో కలిసి స్వచ్ఛభారత్ చేపట్టడం ద్వారా గ్రీన్ గుడివాడగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రామిశెట్టి మురళి ఆధ్వర్యంలో వార్డు ప్రజలతో మమేకమై మున్సిపల్ కార్మికులతో చేయడం చాలా సంతోషకరమైన విషయం అని, ప్రతి వారి కూడా మన ఊరు మన సుభ్రత అనే ఆలోచనతో మన పట్టణాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద ఎరుకపాడు గ్రామస్తులు రామిశెట్టి మురళి, పందిళ్ళ గణపతి, గద్దం బుజ్జి, యువత.. తదితరులు పాల్గొన్నారు.

